www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | గురు వారం, 27 అక్టోబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-175 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## ఎమ్మెల్యేల కొనుగోలుకు కుట్ర !

# వీళ్లే.. వాళ్లు

### కిషన్‌రెడ్డి, రాజ్‌నాథ్‌సింగ్, యోగిలతో దిగిన నిందితుల ఫోటోలు

**బీజేపీ కుట్రలకు తెరలేపిందని టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ఆరోపణ - ఇటీవల ఎమ్మెల్యే రఘునందన్ వ్యాఖ్యలకు సింక్**



- టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ప్రలోభాలు
- డబ్బులు ఆశచూపి కొనే యత్నాలు
- ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌజ్‌లో మంతనాలు
- ఎమ్మెల్యేల సమాచారంతో కుట్రను భగ్నం చేశమన్న సైబరాబాద్ సిపి
- 15 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు స్టీఫెన్ రవీంద్ర వెల్లడి
- టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారన్న ఎమ్మెల్యే రఘునందన్, ఇటీవల స్టేట్‌మెంట్‌కు సింకైన వైనం
- వ్యవహారాన్ని తీవ్రంగా ఖండించిన టీఆర్ఎస్

**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమ సమాజం):** టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుట్రజరుగుతోందని కరీనంనగర్‌లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్ కుమార్ ఉదయం చెప్పడం..సాయంత్రం అలాంటి ఘనట జరగడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. నలుగురు టిఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించిన వ్యవహారం హైదరాబాద్‌లో బట్టబయలు అయ్యింది. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనేందుకు బీజేపీ వేసిన వలను సైబరాబాద్ పోలీసులు చేధించారు. ముగ్గురు బీజేపీ దూతలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీపీ స్టీఫెన్ రవీంద్ర మీడియాతో మాట్లాడారు. దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఓ స్వామి మరో ఇద్దరితో కలసి ఈ వ్యవహారాం నడిపినట్లు గుర్తించారు. దీనికి సంబంధించి కొంత నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సైబరాబాద్ సిపి స్టీఫెన్ రవీంద్ర దాడి చేసి గుట్టును రట్టు చేశామని ప్రకటించారు. నలుగురు ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, పైలట్ రోహిత్ రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌజ్‌లో సమావేశం కావడం..ఢిల్లీకి చెందిన స్వామి తో పాటుమరో ఇద్దరు రావడం జరిగిందని, టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాచారంతోనే కుట్రను భగ్నం చేశామని సిపి తెలిపారు. నలుగురు ఎమ్మెల్యేలను

3లో

## నాగోల్ 2 ఎల్బీనగర్

# ఫ్లై ఓవర్

**అందుబాటులోకి వచ్చిన నాగోల్ ఫ్లై ఓవర్ ● ప్రారంభించిన మంత్రికెటీఆర్**





**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమ సమాజం):** హైదరాబాద్ నగరంలోని నాగోల్ ఫ్లైఓవర్ ను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ మహానగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. నాగోల్‌లో రూ.143 కోట్ల ఖర్చుతో 990 మీటర్ల పొడవైన ఫ్లైఓవర్‌ను నిర్మించామని చెప్పారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణంతో ఉప్పల్ నుంచి ఎల్బీ నగర్ వరకు ప్రజలు ట్రాఫిక్ కష్టాలు లేకుండా ప్రయాణం చేయవచ్చున్నారు. వచ్చే ఏడాది మార్చి నెలలోపల మరో నాలుగు ప్రాజెక్టులు పూర్తవుతాయని

3లో




## గొల్లకురుమల అభివృద్ధికి కెసిఆర్ కృషి

- వారికి అర్థికంగా అండగా నిలిచారు
- మన్నెగూడ యాదవ-కురమ సభలో మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,అక్టోబర్ 26 (సమ సమాజం):** త ధర్మం వైపు నిలబడే జాతి గొల్ల కురమ

3లో

## ఉమ్మడి జిల్లాలో 'జోడో యాత్ర'కు సర్వం సిద్ధం

- నేడు మక్తల్ నుంచి యాత్రకు శ్రీకారం
- రాహుల్‌కు భారీగా స్వాగతం పలకడానికి సన్నాహాలు
- మూడంచల భద్రతా ఏర్పాట్లలో పోలీసులు
- పాలమూరులో ఐదు రోజులు, 120 కిలోమీటర్ల పాదయాత్ర
- ఏర్పాట్లను పరిశీలించిన ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్



**మహబూబ్‌నగర్,అక్టోబర్ 26 (సమ సమాజం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు ఘన స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఐదు రోజుల పాటు సాగే పాదయాత్ర కృష్ణావారధి నుంచి బాలానగర్ సరిహద్దు వరకు దాదాపు 120 కిలో మీటర్ల మేర సాగనుంది. ఈ యాత్రలో విద్యార్థులు, మేధావులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, ప్రజాస్వామికవాదులు, సామాజిక కార్యకర్తలు, ఉద్యోగులు, లౌకిక ప్రజాతంత్ర శక్తులందరూ పాల్గొనాలని కోరుతూ కాంగ్రెస్ విస్తృత ప్రచారం చేస్తోంది. పాదయాత్రకు ఆటంకాల్లేకుండా ఇప్పటికే రూట్ మ్యాప్‌ను ఏఐసీసీ నాయకులు మొదలుకొని జిల్లా పార్టీల

3లో

## ఎమ్మెల్యేగా కూసుకుంట్ల చేసిన అభివృద్ధి ఏమిటో?

- మీరే సిఎంగా ఉన్నా మునుగోడు ఎందుకు వెనకబడ్డది
- చేనేతపై 5శాతం జిఎస్టీ ఒప్పుకున్నది మీరే కదా
- చేనేత సంఘాలకు ఎందుకు ఎన్నికలు నిర్వహించడం లేదు
- సిఎం కెసిఆర్‌కు బండి సంజయ్ ఘాటు లేఖ



**హైదరాబాద్,అక్టోబర్ 26 (సమ సమాజం):** మునుగోడు ఉపఎన్నికల వేళ...సీఎం కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ లేఖ రాశారు. తెలంగాణ ప్రజలు, మునుగోడు ఓటర్ల తరపున ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రశ్నలు సంధించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాలని లేఖలో డిమాండ్ చేశారు. . తెలంగాణ ఏర్పడ్డ నుంచి మీదే ప్రభుత్వం, మీరే ముఖ్యమంత్రి, తొలిటర్మ్ (2014- 18) మీ పార్టీకి చెందిన ప్రభాకర్‌రెడ్డే ఎమ్మెల్యే! 8 ఏళ్ల

3లో



## కాంట్రాక్ట్ రాజకీయాలకు రెఫరెండమ్

- మునుగోడుతో స్వార్థ రాజకీయాలకు చెక్
- ప్రచారంలో మంత్రులు గంగుల, జగదీశ్ రెడ్డిల పిలుపు
- బిజెపికి డిపాజిట్ కూడా రాకుండా చేయాలని వినతి

**మునుగోడు, అక్టోబర్ 26 (సమ సమాజం):** మునుగోడులో ప్రచారం ఊపందుకుంది. మంత్రులు ప్రచారబరిలో దూసుకుని పోతున్నారు. బిజెపిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నారు. స్వార్థ రాజకీయాలకు మునుగోడు ఉపఎన్నికతో చెక్ పెట్టాలని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కాంట్రాక్టుల కోసం రాజకీయాలు చేసే పార్టీలకు ఈ ఎన్నికలు రెఫరెండమని చెప్పారు. గత ఎన్నికల్లో గెలుపొందిన రాజగోపాల్ రెడ్డి ప్రజా సమస్యలను పరిష్కరించడం కాదు.. కనీసం వినడానికి కూడా గ్రామాలకు రాలేదని విమర్శించారు. మునుగోడు ఉపఎన్నికల్లో భాగంగా సంస్థాన్ నారాయణపురంలో మంత్రి గంగుల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలిపించాలని కోరారు. టీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే నిజయోజకవర్గ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. 70 ఏండ్ల కాంగ్రెస్, బీజేపీల పాలనలో దేశం ఎలా అధోగతి పాలయిందో మనందరం చూశామని, కేవలం ఎనిమిదేండ్లలోనే సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధిస్తున్న అద్భుత ప్రగతిని

3లో

## 500 రోజుల్లో మునుగోడు అభివృద్ధికి ప్లాన్

**200 కోట్లతో రోడ్లను వేయించే ప్రణాళిక ● ఉప ఎన్నిక కోసం మాస్టర్ ప్లాన్ ప్రకటించిన బిజెపి**

**నల్లగొండ,అక్టోబర్ 26 (సమ సమాజం):** మునుగోడు డెవలప్‌మెంట్ కోసం బీజేపీ మాస్టర్ ప్లాన్ రెడీ చేసింది. నియోజకవర్గ అభివృద్ధి కోసం కోసం తీసుకునే చర్యలను వివరిస్తూ ఆ పార్టీ మేనిఫెస్టో విడుదల చేసింది. 500 రోజుల్లో మునుగోడును సమగ్రంగా అభివృద్ధి చేస్తామని బీజేపీ అభ్యర్థి రాజగోపాల్ రెడ్డి ప్రకటించారు. కేంద్ర పెద్దలతో మాట్లాడే హామీలు ఇస్తున్నట్లు చెప్పారు. తెలంగాణకు బీజేపీయే శ్రీరామ రక్ష అన్న ఆయన.. రాష్ట్రం బాగుపడాలంటే తమ వల్లే సాధ్యమని చెప్పారు. కనీసం రోడ్లు వేయిద్దామన్న కాంట్రాక్టర్లు టెండర్లు వేసే పరిస్థితి లేదని రాజగోపాల్ వాపోయారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటామన్న రాజగోపాల్ కేంద్రం పెద్దలతో మాట్లాడే హామీ ఇస్తున్నాని చెప్పారు. నియోజకవర్గంలో రూ.200 కోట్లతో రోడ్లు వేయిస్తామని ప్రకటించారు. ఇందుకు అవసరమైన నిధులు ఇచ్చేందుకు నితిన్ గడ్కరీ అంగీకరించినట్లు చెప్పారు. చేనేత కార్మికులకు టెక్స్ టైల్ పార్కు, చౌటుప్పల్ లో రూ. 25 కోట్లతో ఐటీఐ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎ÷-లోరైడ్ అధికంగా ఉన్న మునుగోడులో సమస్య పరిష్కారానికి ఎ÷-లోరైడ్ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మర్రిగూడలో

3లో



## సంపాదకీయం

# రాజకీయాల చుట్టూ నేతల పరిభ్రమణం !

తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మునుగోడు ఉప ఎన్నికతో పాటు వివిధ సమస్యలపై అధికార విపక్షాల మధ్య రాజకీయ విమర్శలు ఊపందుకున్నాయి. ఇక ఎపిలో మూడు రాజధానుల ముచ్చటలో విమర్శలు ప్రతివిమర్శలు జోరుగా సాగుతున్నాయి. ఎన్నికలకు ఎపిలో మరో ఏడాదిన్నర కాలం ఉన్నా ఎజెండా అంతా మూడు రాజధానుల చుట్టూ తిరుగుతోంది. తెలంగాణలో మునుగోడుతో పాటు, కేంద్రంలో బిజెపిని దుమ్మెత్తి పోసే పనిలో టిఆర్ఎస్ ఉంది. టిఆర్ఎస్‌కు వ్యతిరూకంగా కాంగ్రెస్, బిజెపిలు కత్తులు దూస్తున్నాయి. మీడియాలో, సోషల్ మీడియాలో ప్రస్తుతం ఇవే అంశాలపై చర్చ సాగు తోంది. అయితే ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అధికార పార్టీలు వ్యూహాత్మకంగా వాటిని పక్కకు తప్పించేశారు. పాలక పక్షాల ప్రచారాలు, ప్రభుత్వంలోకి రావాలనే ప్రతిపక్షాల ఆరాటాలే ప్రధాన ఎజెండాగా మారింది. ఈ క ÷-రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక అంశాలు మరుగున పడ్డాయి. జాతీయ పార్టీలైన బిజెపిచ కాంగ్రెస్‌లు సైతం ప్రజల సమస్యలను పక్కకు తోసి అధికార పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టడానికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు టిఆర్ఎస్, వైసిపిలు తమ రాష్ట్రాల్లో మరోమారు అధికారంలోకి రావడమెలా అన్న ఎత్తుగడల్లో మునిగిపోయాయి. సమస్యలను, పరిష్కారాలను పక్కన పెట్టేసి వచ్చే ఎన్నికల్లో గెలవడం ఎలా అన్న కోణంలో తాపత్రయ పడుతున్నాయి. మరోవైపున జాతీయ స్థాయిలో చక్రం తిప్పాలనే లక్ష్యంతో ఉన్న కెసిఆర్ ,టిఆర్ఎస్ నేతలు కూడా కేంద్రంలోని బిజెపి లక్ష్యంగా విమర్శలకు పదను పెట్టారు. మునుగోడులో లబ్దిపొందడమెలా అన్న ఆలోచయనతో ముందుకు సాగుతున్నారు. ఇకపోతే బిజెపికి చెందిన జాతీయ పార్టీల నేతలే రెండు చోట్ల రెండు రకాలుగా మాట్లాడుతూ గందరగోళం సృష్టి స్తున్నారు. వ్యక్తిగత దూషణలు పరాకాష్టకు చేరుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ చర్చలో పరస్పర ప్రభావం కూడా గతం కంటే ఎక్కువగా ముందుకొస్తోంది. ప్రజా ఉద్యమాలు, ఉద్యోగ కార్మికులు గ్రామీణ ప్రజల పోరాటాలకు ఉద్యమాలపై పాలకుల నిర్బంధం, పాలక పార్టీల ఉపేక్షా భావనే కొనసాగు తున్నది. ఎ.పిలో రాజధాని సమస్యపై బాధిత రైతుల పాదయాత్ర లూ, ప్రభుత్వ మద్దతుతో విశాఖ గర్జనల మధ్య ఉద్రిక్తతలు కొత్త చర్చకు దారితీశాయి. మూడు రాజధానులతో పాటు, యాత్రను అడ్డుకునే ప్రయత్నా లను అధికార వైసిపి చేపట్టింది. రైతులను అడ్డుకోవడం, దాడులకు తెగబడడం, అదంతా టిడిపి ఆడిస్తున్న నాటకంగా పరొజెక్ట్ చూపిస్తూ ముందుకు సాగుతున్నారు. త్వరలోనే విశాఖకు రాజధాని తరలి వస్తుందని మంత్రులు బొత్స, గుర్నాథ్ తదితరులు రొమ్ము విరిచి చెబుతున్నారు. విశాఖ గర్జన, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనవాణి నేపథ్యంలో జరిగిన పరిణామాలు ఇప్పటికే ప్రజల్లో తీవ్ర గందరగోళానికి దారితీ సాయి. ఈ సందర్భంగా విశాఖలో జనసేనపై జరిగిన దాడితో టిడిపి, బిజెపిలు పవన్ కళ్యాణ్‌కు దగ్గర య్యాయి. పవన్ కళ్యాణ్ కూడా వీరితో కలసి వైసిపిపై పోరాడాలన్న సంకల్పంతో ఉన్నారు. ఇదంతా చోద్యం చూస్తున్న కేంద్రంలోని బిజెపి ఇటు అమరావతి విషయంలోనూ అటు విశాఖ ఉక్కుతో సహా అనేక విభ.న హామీల విషయంలో కప్పదాటు వ్యవహారాన్ని నడిపిస్తోంది. ఈ ఘటనల తర్వాత విజయవాడ వచ్చిన పవన్ కళ్యాణ్ తన ప్రసంగంలో చెప్పు చూపించి వైసిపి పై తీవ్రమైన వ్యాఖ్యలు చేయడంతో రాజకీయ విమర్శలు తారాస్తాయికి చేరాయి. వైసిపి నాయకులు, మంత్రులు తనపై వ్యక్తిగత దూషణను తీవ్రంగా ఖండించారు. ప్రతిగా ఇప్పుడు వైసిపి కూడా పవన్ లక్ష్యంగా ఆయన మూడు పెళ్లిళ్ల బాగోతాన్ని రచ్చ చేస్తోంది. 2019 ఎన్నికల ఓటమి తర్వాత మళ్లీ బిజెపికి దగ్గరవాలని తహతహ లాడుతున్న టిడిపి, జనసేనకు కూడా ఎప్పుడూ సంకేతాలు పంపుతూనే వుంది. ఈ సందర్భాన్ని వెంటనే ఉపయోగించుకుని రంగంలోకి దిగిన చంద్రబాబు పవన్‌కు సంఘీభావం చెప్పడమే గాక తాము ఉభయులం కలసి రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమం చేపడతామని ప్రకటించారు. మునుగోడులో టిఆర్ఎస్ గెలిస్తే బిజెపిపై మరింత గట్టిగా పోరాడడానికి అవకాశం వస్తుంది. బిజెపిలో దూకిన కాంగ్రెస్ నేత రాజగోపాల్ రెడ్డిని ఓడించేందుకు మునుగోడులో ఉభయ కమ్యూనిస్టు పార్టీలూ టిఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకరరెడ్డికి మద్దతునిస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో అన్ని చోట్ల కాలు మోపేందుకు మోడీ,షాలు పాచికలు వేస్తున్న క్రమంలో మునుగోడు ఎన్నిక ఫలితం కీలకమవుతుంది. అయితే, మోడీ ప్రభుత్వ కేంద్రీకృత పెత్తనం, కార్పొరేట్ విధానాలు మాత్రం మారవు గనక వాటిని ప్రతిఘటించడం రాజకీయ పార్టీలకు అనివార్యం కావాలి. మొత్తంగా స్వార్థ రాజకీయాల చుట్టూ నేతలు పరిభ్రమిస్తున్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి రాజకీయం నెరపుతు న్నారు. దీనిని ప్రజలు ఎలా స్వీకరిస్తారన్నది చూడాలి.

**పృధ్విరాజ్ గోసుకొండ**
ఎడిటర్

### ఎమ్మెల్యేల కొనుగోలుకు కుట్ర

# వీళ్లే.. వాళ్లు

(మొదటి పేజీ తరువాయి) కొనేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా ముగ్గురు సభ్యులతో కూడిన బృందాన్ని బీజేపీ అధిష్టానం ఏర్పాటు చేసిందని అధికార పార్టీ ఆరోపిస్తోంది. వీరు భారీగా డబ్బులు ఎర వేసేందుకు ప్రయత్నిస్తూ హైదరాబాద్‌లో పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఇప్పటివరకు రూ.15 కోట్ల నగదును పోలీసులు సీజ్ చేశారు. పట్టుబడిన వారిలో బీజేపీ నేతలు రామచంద్రభారతి, సింహయాజులు, నందకుమార్ ఉన్నారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి అజీజ్ నగర్‌లోని పీవీఆర్ ఫామ్ హౌస్‌లో కోట్లలో నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు దొరికిపోయిన వారిలో దక్కన్ ప్రైడ్ హోటల్ యజమాని నందకుమార్ కూడా ఉన్నారు. ఈయన కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడని సమాచారం. స్వామి రామచంద్రభారతి ఢిల్లీ నుంచి రాగా, సింహయాజులు తిరుపతికి చెందిన వారని పోలీసులు తెలిపారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాచారంతో రైడ్ చేసినట్లు సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. డబ్బు, కాంట్రాక్టులు, ఇతర పదవులు ఇస్తామని ప్రలోభ పెడుతున్నట్లు ఎమ్మెల్యేలు సమాచారమిచ్చినట్లు వెల్లడించారు. వీరి సమాచారంతోనే ఫామ్‌హౌజ్‌పై రైడ్ చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన వారిలో ఫరీదాబాద్‌కు చెందిన రామచంద్రభారతి అలియాస్ సతీశ్ శర్మ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరిపారని, ఆ సమయంలో తిరుపతి నుంచి వచ్చిన స్వామిజీ సింహయాజులు, హైదరాబాద్‌కు చెందిన నందకుమార్ రామచంద్రభారతితో ఉన్నారని స్టీపెన్ రవీంద్ర వివరించారు. వీరు ముగ్గురు ఎమ్మెల్యేలను ప్రలోభపెడుతున్నట్టు తెలిసింద న్నారు. దీనిపై చట్టపరమైనచర్యలు తీసుకుంటామని సీపీ పేర్కొన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేస్తున్నామని అన్నారు. ప్రలోభాలు పెట్టారన్న ఆరోపణలపై విచారణ జరుపుతున్నామని సీపీ పేర్కొన్నారు. రామచంద్రభారతి సంప్రదింపులు జరిపినట్లు సమాచారం ఉందన్నారు. పార్టీ ఫిరాయిస్తే నగదుతో పాటు పదవులు ఇస్తామని ప్రలోభ పెట్టినట్లు అనుమానం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాచారంతోనే ఈ ఆపరేషన్ నిర్వహించామన్నారు. పీఠాధిపతి రామచంద్రభారతి కేంద్రంగా ప్రలోభాలకు కుట్ర జరిగిందన్నారు. స్వామిజీ రామచంద్ర భారతి ఢిల్లీ నుంచి వచ్చారని సీపీ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. మధ్యవర్తిగా దెక్కన్ ÷-రెడ్ హోటల్ ఓనర్ నందకుమార్ వ్యవహరించినట్లు తెలిపారు. తిరుపతి నుంచి ఒక స్వామిజీ ఇక్కడికి వచ్చారని సీపీ స్టీఫెన్ రవీంద్ర వ్యాఖ్యానించారు. తమను కొంతమంది ప్రలోభ పెడుతున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సమాచారం అందించారని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. డబ్బు, కాంట్రాక్టులు, ఇతర పదవులు ఇస్తామని ఆశచూపారని పేర్కొన్నారు. వారిచ్చిన సమాచారంతో ఫామ్ హౌజ్‌పై రైడ్ చేశామన్నారు.

# మునుగోడు తెలంగాణలో లేదా?

### ఎందుకు అభివృద్ధిని విస్మరించారు

### ప్రచారంలో రాజగోపాల్ విమర్శలు



**నల్లగొండ,అక్టోబర్ 26 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నిక రాష్ట్ర భవిష్యత్తు కోసం వచ్చిన ఎన్నిక అని బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా మునుగోడు మండలం కిష్టపురం గ్రామంలో క్యాంపెయినింగ్ నిర్వహించారు. ఉప ఎన్నికతో ఫాంహౌస్ లో పడుకున్న కేసీఆర్ తో పాటు ఆయన కుటుంబాన్ని మునుగోడుకు తీసుకొచ్చానని అన్నారు. సీఎం కేసీఆర్ సిద్ధిపేట, సిరిసిల్ల జిల్లాల అభివృద్ధికి మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారని రాజగోపాల్ ఆరోపించారు. మునుగోడు తెలంగాణ రాష్ట్రంలో లేదా, తమ ప్రాంతం అభివృద్ధి చెందొద్దా అని ప్రశ్నించారు. 1000 మంది ఆత్మ బలిదానంతో ఏర్పాటైన తెలంగాణ ఇప్పుడు ఒక్క కుటుంబం కోసం ఏర్పడినట్లైందని కోమటి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాచరిక పాలన పోవాలంటే కేసీఆర్ కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం తెలంగాణ ప్రజలంతా మునుగోడు వైపు చూస్తున్నారని, రాష్ట్రంలో కుటుంబ, అవినీతి పాలన పోయి ప్రజాస్వామ్యం రావాలంటే తనను గెలిపించాలని కోరారు. కోమటిరెడ్డితో పాటు ప్రచారంలో పాల్గొన్న చొప్పదండు మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ కేసీఆర్ పై తీవ్ర విమర్శలు చేశారు. ఉద్యమకారులను అసెంబ్లీలో చూసే ఇష్టం లేక సీఎం కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్ కు ఓటేయకుంటే సంక్షేమ పథకాలు ఆపేస్తామని అంటున్నారని మండిపడ్డారు. ప్రజల కోసం పని చేసే నాయకుడైన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని శోభ కోరారు. కల్వకుంట్ల కుటుంబంతో కొట్లాడుతున్న ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

# మునుగోడు ముంగిట ..బిజెపికి మరో ఎదురుదెబ్బ

### పార్టీకి రాజీనామా చేసిన మాజీ ఎంపి రాపోలు ఆనంద భాస్కర్



**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నికకుముందే బిజెపికి గట్టి ఎదురుదెబ్బలు తారుతున్నాయి. మొన్నటికిమొన్న తెలంగాణ ఉద్యమకారులు స్వామిగౌడ్, దాసోజు శ్రవణ్‌లు పార్టీనివీడి సొంత పార్టీ టిఆర్ఎస్‌లో చేరారు. మరిన్నిచేరికలు ఉంటాయన్న సంకేతాల నేపథ్యంలో తాజాగా మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద భాస్కర్ సైతం బిజెపికి రామ్‌రామ్ చెప్పారు. ఈ క్రమంలో తెలంగాణలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా బీజేపీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు నేతలు బీజేపీని వీడి టీఆర్ఎస్ లో చేరారు. తాజాగా మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ కూడా బీజేపీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు బుధవారం జేపీ నడ్డాకు రాపోలు ఆనంద్ భాస్కర్ రాజీనామా లేఖ పంపారు. రెండు, మూడు రోజుల్లోనే ఆయన టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉంది. ఆదివారం ఆయన ప్రగతి భవన్ లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను, పరిశ్రమ అభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. రాజీనామా లేఖలో రాపోలు... పార్టీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గడిచిన నాలుగేండ్ల లో పార్టీ నాయకత్వం తనని విస్మరించిందని ఆరోపించారు. తనను ఎన్నోసార్లు అవమానించారని, తక్కువ చేసి చూశారని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో తనకి ప్రాధాన్యం లేకుండా చేసినా అవమానాలను దిగమింగుతూనే వచ్చానన్నారు. ఇటీవలే ప్రగతి భవన్ లో సీఎం కేసీఆర్ ను కలిసిన ఆయన రాబోయే 3 రోజుల్లో టీఆర్ఎస్ లో చేరే అవకాశముందన్న వార్తలు వస్తున్నాయి.

# 30న షాద్‌నగర్‌కు రాహుల్: రేవంత్

**హైదరాబాద్,అక్టోబర్ 26 (సమ సమాజం):** ఈనెల 30న షాద్‌నగర్‌కు కాంగ్రెస్ నేత రాహుల్ భారత్ జోడో యాత్ర చేరుకోనుందని టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి తెలిపారు. నవంబర్ ఒకటిన మధ్యాహ్నం 12 గంటలకు మునుగోడులో మహిళా గర్జన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మునుగోడు ప్రజలు మహిళా గర్జనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం ఉదయం మక్తల్‌లో రాహుల్ జోడో యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈనెల 27 నుంచి నవంబర్ 7 వరకు భారత్ జోడో యాత్ర నిర్వహించ నున్నట్లు వెల్లడించారు.

# ఢిల్లీ నుంచిరాత్రికి హైదరాబాద్‌కు రాహుల్

### నేడు మక్తల్ నుంచి తిరిగి జోడో యాత్రప్రారంభం



**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమ సమాజం):** తెలంగాణలో రాహుల్ జోడో యాత్ర గురువారం ఉదయం 6:30 గంటలకు మక్తల్ సబ్ స్టేషన్ నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న రాహుల్ రాత్రికి ఢిల్లీ నుంచి శంషాబాద్ విమానాశ్రయంలో దిగి నేరుగా మక్తల్‌కు వెళ్లనున్నారు. ఈ నెల 23న రాయచూర్ నుంచి రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్ర తెలంగాణలోకి ప్రవేశించింది. దీపావళి, ఖర్గే ఏఐసీసీ అధ్యక్ష బాధ్యతల స్వీకరణ కారణంగా రాహుల్ యాత్రకు బ్రేక్ ఇచ్చారు. మూడు రోజుల విరామం తరువాత నేటి ఉదయం 6:30 గంటలకు జోడోయాత్ర తిరిగి ప్రారంభం కానుంది. వచ్చే నెల 7 వరకు తెలంగాణలో రాహుల్ జోడోయాత్ర కొనసాగనుంది. రాహుల్ పాదయాత్రలో ప్రతి రోజు సాయంత్రం 7 గంటలకు కార్నర్ సమావేశం జరగనుంది. చివర రోజున భారీ జనసమీకరణతో సమావేశం ఏర్పాటుకు టి.కాంగ్రెస్ సన్నాహాలు చేస్తోంది.

# మునుగోడులో మంత్రుల ప్రచార జోరు

### అన్ని వర్గాలను కలుస్తూ ప్రచార ఉధృతి❑ముదిరాజ్‌లకు అండగా ఉంది కెసిఆర్ అన్న కెటిఆర్❑ఆర్ఎంపిలు టిఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలన్న ఎర్రబెల్లి

**నల్గొండ,అక్టోబర్ 26 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నికలో టిఆర్ఎస్ జోరు పెంచింది. ఇక్కడే మకాం వేసిన మంత్రులు అన్ని వర్గాలను కలుస్తూ అభివృద్ధి పథకాలతో పాటు, అందచేస్తున్న సాయాన్ని వివరిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రులు కెటిఆర్, తలసాని, ఎర్రబెల్లి తదితరులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఆయా సంఘాలతో భేటీ అవుతూ ఓట్లను అర్థించారు. జిల్లాలో ఇంటింటికి నీళ్లిచ్చి ఫ్లోరైడ్‌ను తరిమికొట్టిన ఘనత కేసీఆర్‌దేనని మంత్రి కేటీఆర్ అన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని మన్నెగూడలో నిర్వహించిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. 2014 కు ముందు కరెంట్, తాగు, సాగునీటి సమస్య ఉండేదని.. కానీ టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వాటిని పరిష్కరించామన్నారు. దేశంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు. ఆసరా పెన్షన్లతో ఎంతోమందికి అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో అన్ని కులవృతులకు పూర్వ వైభవం తెచ్చామని కేటీఆర్ తెలిపారు. కొత్తగా 978 గురుకులాలు పెట్టి.. ఒక్కో విద్యార్థిపై లక్షా 25 వేలు ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రతి ఏటా 110 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ఉచిత చేప పిల్లలు పంపిణీ చేస్తున్నామన్న మంత్రి.. ఫిషరీష్‌లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. త ప్రభుత్వాలు కులవృత్తులను పట్టించుకోలేవని.. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కులవృత్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఉద్యమ నాయకుడే సీఎం కావడంతో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. చండూరు లో పీఎంపీ,ఆర్ఎంపీలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఆయా సంఘాలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు అండగా ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సమస్యలు పరిష్కరించడానికి సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నారని అన్నారు. మునుగోడులో ఎన్నికలు రావడానికి గల కారణాలను వివరించారు. మునుగోడులో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించే విధంగా సహకరించాలని మంత్రి కోరారు. మరోవైపు మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సీపీఐ, సీపీఎం నాయకులతో భేటీ అయ్యారు. బుధవారం చండూరులో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో కొనసాగుతున్న ప్రచార బృందం ఎదురుపడింది. దీంతో ఇరువురు కలుసుకుని కొద్దిసేపు ముచ్చటించారు. మునుగోడు ఎన్నికల్లో జరుగుతున్న ప్రచార సరళిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల స్పందన ఎలా ఉందని వారితో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలని వారికి సూచించారు. బీజేపీ రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాలను ప్రజలకు వివరించి ఈ ఎన్నికల్లో వారికి గట్టి బుద్ధి చెప్పేలా ఓటర్లను చైతన్య పరచాలని సూచించారు. ఈ సందర్భంగా చండూరుకు చెందిన సీనియర్ నాయకులు జోగి సంతోశ్, గుంటి మల్లేశ్ టీఆర్ఎస్ లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# మునుగోడు ఉపఎన్నికలో బీజేపీ కుట్రలు సాగవు

### అభివృద్ధి,సంక్షేమం టిఆర్ఎస్‌తోనే సాధ్యం

### ప్రజలంతా సిఎం కెసిఆర్ వెంటే ఉన్నారు

### మునుగోడు గెలుపుతో జాతీయ రాజకీయాల్లో కుదుపు

### మంత్రి వేముల ప్రశాంతరెడ్డి వెల్లడి



**నల్లగొండ,అక్టోబర్ 26 (సమ సమాజం):** మునుగోడు ఉపఎన్నికలో బీజేపీ కుట్రలు సాగవని, ధన బలంతో బీజేపీ ఎలాగైనా గెలవాలని చేస్తున్న కుయుక్తులను ప్రజలు తిప్పి కొడతారని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మునుగోడులో బిజెపిని ఓడించడం ద్వారా జాతీయరాజకీయాలకు నిచ్చెన వేస్తామని అన్నారు. మునుగోడులో ప్రజలంతా టిఆర్ఎస్ సంక్షేమ పాలన, కెసిఆర్ పథకాల పట్ల పూర్తి విశ్వాసంతో ఉన్నారని అన్నారు. కాంట్రాక్టుల కోసం పార్టీ మారిన బీజేపీ అభ్యర్థిని కలిసికట్టుగా ఓడించాలని మంత్రి పిలుపు నిచ్చారు. కాంట్రాక్టుల కోసం అమ్ముడుపోయిన రాజగోపాల్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. సబ్బండ వర్గాల సంక్షేమ మే ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. తెలంగాణలో అన్ని ప్రాంతాలకన్నా ముందు మునుగోడుకు తాగునీరిచ్చి విషపునీళ్ల నుంచి విముక్తి కలిగించింది కేసీఆరే అని గుర్తు చేశారు. మునుగోడు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు టీఆర్ఎస్‌కే ఉన్నాయని చెప్పారు. టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా గత పక్షం రోజులుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపఎన్నిక ఎందుకు వచ్చిందో ప్రజలందరికీ తెలుసన్నారు. 24 గంటల ఉచిత కరెంటు కావాలంటే టీఆర్ఎస్‌కు ఓటు వేయాలని, 6 గంటల కరెంటు కావాలంటే బీజేపీకి వేయాలని చెప్పారు. ఈ ఉపఎన్నిక ప్రధాని మోదీ, కేసీఆర్‌కు మధ్య జరుగుతు న్నదని చెప్పారు. మోటర్లకు మీటర్లు పెడితే ఏమవుతుందని బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతు న్నారని గుర్తుచేశారు. వంట గ్యాస్ 400 నుంచి 1,200 చేసినందుకు మోదీకి ఓటెయ్యాలా? అని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ రేట్లు విపరీతంగా పెంచింది కేంద్రంలోని బీజేపీ సర్కారు కాదా? అని నిలదీశారు. కూసుకుంట్ల గెలిచిన రెండు నెలల్లోనే డబుల్ బెడ్రూం ఇండ్లు ప్రారంభించి లబ్దిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గడపగడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే టీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని చెప్పారు. ఎవరు ఎన్ని గిమ్మిక్కులు చేసినా నమ్మి మోసపోవద్దన్నారు. తెలంగాణ ఉద్యమం లో 18 ఏండ్లు పనిచేసిన ఉద్యమకారుడికి.. రూ.18 వేల కోట్ల కాంట్రాక్టు కోసం అమ్ముడుపోయి బీజేపీలో చేరిన వ్యక్తికి జరుగుతున్న పోరే మునుగోడు ఉప ఎన్నిక అని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో కాంగ్రెస్ నుంచి రాజగోపాల్ గెలిచినప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు ఆయనకు ఓటేసినా చేసేది ఏమీ ఉండదన్నారు. అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. బీజేపీ ఓటు వేస్తే బావుల దగ్గర మోటర్లకు మీటర్లు పెడుతుందని ఆయన మండిపడ్డారు. నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలపై ప్రతినెలా 3 నుంచి 5 వేల భారం పడుతున్నదన్నారు.

# ఎమ్మెల్యే రాజాసింగ్‌పై పిడి యాక్ట్

### సమర్థించిన అడ్వయిజరీ బోర్డు

**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమ సమాజం):** గోషా మహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పై పీడీ యాక్ట్ ను అడ్వైజరీ బోర్డు సమర్థించింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందించింది. తనపై నమోదు చేసిన పీడీయాక్ట్ ను ఎత్తివేయాలని రాజాసింగ్ చేసిన విజ్ఞప్తిని కమిటీ తిరస్కరించింది. ఇరు పక్షాల వాదనలు విన్న కమిటీ సభ్యులు పోలీసుల వాదనతో ఏకీభవించారు. పీడీ యాక్ట్ ఎత్తేయాలన్న రాజాసింగ్ విజ్ఞప్తిని తిరస్కరించారు.

# రుషి సునాక్ మావాడే

### పాక్‌లోనూ హర్షాతిరేకాలు

**ఇస్లామాబాద్, అక్టోబర్ 26 (సమ సమాజం):** రిషి సునాక్ బ్రిటన్ ప్రధానమంత్రిగా ఎన్నికైన నేపథ్యంలో పాకిస్థాన్‌లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సునాక్ తాత, మామ్మ అవిభాజిత భారతదేశంలోని గుజ్రన్‌వాలా నగరంలో జన్మించారు. ఇప్పుడా నగరం పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలో ఉంది. దీంతో రిషి సునాక్ తమ వాడని ప్రకటించాలంటూ పాకిస్థాన్‌లోని నెటిజన్లు పాక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రిషి తాత రాందాస్ సునాక్ కెన్యాలోని నైరోబీలో క్లర్క్ ఉద్యోగం చేసేందుకు 1935లో గుజ్రన్‌వాలా నుంచి తరలిపోయారు. రాందాస్ భార్య సుహాగ్ రాణి సునాక్ తన అత్తగారితో కలిసి గుజ్రన్‌వాలా నుంచి ముందు ఢిల్లీకి వెళ్లారు. ఆ తర్వాత 1937లో ఆమె కెన్యా వెళ్లారు’ అంటూ సౌత్ ఆంప్టన్‌లో రిషి సునాక్ జన్మించే వరకు ఆయన పూర్వీకుల వివరాలను క్వీన్ లైనెస్ 86 పేరుతో ట్వీటర్‌లో ఉంచారు.

# బియ్యం సమర్పణకు నవంబర్ 30 వరకు గడువు

### వెల్లడించిన మంత్రి గంగుల కమలాకర్



**హైదరాబాద్, అక్టోబర్ 26 (సమ సమాజం):** ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సీఎంఆర్ గడువు పెంపు విషయంలో చేసిన కృషి ఫలించింది. 2021-22 వానాకాలం బియ్యాన్ని సమర్పించేందుకు ఈ నవంబర్ 30 వరకు భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) గడువును పెంచిందని మంత్రి పేర్కొన్నారు. నిరంతరం రాష్ట్ర రైతాంగం గురించి తపించే ప్రభుత్వ యంత్రాంగం రైతులకు లబ్ది చేకూర్చేందుకు అనుక్షణం తపిస్తూనే ఉంటుందన్నారు. అందుకు నిదర్శనంగా రైతుకు అనుకూల నిర్ణయాల కోసం చేసిన ప్రయత్నాలు ఫలించాయన్నారు. దీంతోపాటు గత యాసంగి బియ్యం బాయిల్డ్ గా తీసుకునేందుకు మరో నాలుగు లక్షల టన్నులకు అనుమతించిందని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన ఎనిమిది లక్షలు టన్నులతో కలిసి మొత్తం 12 లక్షల మెట్రిక్ టన్నుల ఫోర్టి÷డ్ బాయిల్డ్ రైస్ సేకరణకు మార్గం సుగమమైందన్నారు. తద్వారా రాష్ట్ర ఖజానాకు దాదాపు 180 కోట్లు ఆదా అవుతాయని మంత్రి పేర్కొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో 'జోడో యాత్ర'కు సర్వం సిద్ధం

(మొదటి పేజి తరువాయి) నాయకులు, పోలీసు యంత్రాంగం పలుమార్లు పరిశీలించి మార్పులు, చేర్పులు చేశారు. 23న మొదటి రోజు గుడెబల్లూరు వరకు పాదయాత్ర చేసే రాహుల్‌గాంధీ మధ్యాహ్నం తర్వాత ఢిల్లీ వెళ్ళారు. దీపావళి నేపథ్యంలో 24, 25, 26 తేదీల్లో పాదయాత్రకు విరామం ప్రకటించారు. తిరిగి 27న గురువారం నుంచి మక్తల్ సమీపంలోని 33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి పాదయాత్ర మొదలవుతుంది. రాహుల్ జోడో యాత్రకు ఘన స్వాగతం పలికేందుకు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు సన్నాహాలు పూర్తి చేశారు. స్వాగత ఏర్పాట్లను రాష్ట్ర నాయకులు, ఇన్‌చార్జిలు దఫదఫాలుగా పరిశీలించారు. పాదయాత్ర కొనసాగే మార్గమంతా వాల్ రైటింగ్స్‌తో నింపేశారు. కృష్ణా బ్రిడ్జి నుంచి మక్తల్ వరకు అడుగడుగునా స్థానిక నాయకులు, పార్టీ నాయకులు భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేసి జాతర వాతవరణం సృష్టించారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో యూనివర్సిటీ మొదలుకొని, అన్ని కళాశాలలను సందర్శించిన నాయకులు దేశ సమైక్యతను ఆకాంక్షిస్తూ రాహుల్‌గాంధీ చేస్తోన్న పాదయాత్రకు అందరూ మద్దతు ప్రకటించాలని కోరారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల నుంచి జనం వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో నాయకులకు ఈమేరకు సంకేతా లినిచ్చి, నియోజకవర్గ నాయకులు అవసరమైన వాహనాలు, పార్టీ జెండాలు, మైకులు తదితర సామాగ్రిని అందించేందుకు సిద్ధమయ్యారు. దేశవ్యాప్త పాదయాత్ర నిర్వహిస్తోన్న రాహుల్‌గాంధీ బృందానికి పోలీసులు భారీ భద్రత కల్పిస్తున్నారు. రాహుల్‌కు మొత్తం మూడంచెల భద్రతను పాదయాత్రకు కల్పిస్తున్నారు. రాహుల్‌తో పాటు పాదయాత్ర చేసే బృం దాన్ని కవర్ చేస్తూ స్పెషల్ రోప్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. భద్రతా చర్యలలో భాగంగా ఇప్పటికే ఎస్‌ఎస్‌జీ అధికారులు, కేంద్ర ఇంటిలిజెన్స్, రాష్ట్ర డీజీపీతో సమీక్ష కొనసాగించారు. ఎక్కడికక్కడ స్థానిక ఎస్పీలు భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ప్రత్యేక పాసులు, ఐడీ కార్డులున్న వారినే రాహుల్‌ను కలిసేలా చూడనున్నారు. మొత్తంగా రాహుల్ పాదయాత్ర అత్యంత భారీ భద్రత నడుమ కొనసాగనుంది. ఎస్‌ఎస్‌జీ అనుమతించిన వారే పాదయాత్రలో రాహుల్‌ను కలవడంతో పాటు, అనుసరించేలా చర్యలు తీసుకుంటున్నారు. రాహుల్‌గాంధీ యాత్ర మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో ఐదు రోజులు కొనసాగుతుంది. మొత్తం 120 కిలోమీటర్ల మేర ఈ రెండు జిల్లాలో పాదయాత్ర కొనసాగనుంది. 27న మక్తల్ సమీపంలోని 33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి పాదయాత్ర ప్రారంభిస్తారు. 11 గంటల వరకు మక్తల్ పట్టణంలోని బొందల కుంటకు చేరు కుంటారు. అక్కడ మధ్యాహ్న విరామం అనంతరం సాయంత్రం నాలుగు నుంచి తిరిగి రాత్రి ఏడు వరకు పాదయాత్ర కొనసాగుతుంది. అక్కడ కార్నర్ మీ టింగ్ నిర్వహిస్తారు. అనంతరం రాత్రికి మరికల్‌లోని ఎలిగండ్ల గ్రౌండ్‌లో రాత్రిబస చేస్తారు. 28 ఉదయం 6.30కు మొదలయ్యే పాదయాత్ర 10.30కు దేవరకద్ర మండలం పెద్దగోప్లాపూర్‌కు చేరుకుంటుంది. అక్కడ మధ్యాహ్న భోజన విరామం అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి యాత్ర మొదలవుతుంది. రాత్రి ఏడు గంటలకు మన్యంకొండ చౌరస్తాకు చేరుకుంటారు. అక్కడ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడిన అనంతరం రాత్రికి ధర్మాపూర్‌లోని జేపీఎన్‌సీఈ కాలేజీలో రాత్రి బస చేస్తారు. 29 ఉదయం ధర్మాపూర్ నుంచి పాదయాత్ర ప్రారంభించే రాహుల్ బృందం ఉదయం 10.30కు యేనుగొండకు చేరుకుంటుంది. అక్కడ విరామం అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి పాదయాత్ర ప్రారంభించి, రాత్రి ఏడుగంటలకు జడ్చర్ల చౌరస్తాకు చేరుకుంటారు. అక్కడ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడతారు. అనంతరం రాత్రికి గొల్లపల్లి సమీపంలోని లలితాంబిక తపోవనంలో రాత్రి బస చేస్తారు. 30న ఉదయం అక్కడి నుంచి బయల్దేరి 11 గంటలకు బాలానగర్ సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద యాత్రకు విరామం ప్రకటిస్తారు. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు అక్కడి నుంచి బయల్దేరి షాద్‌నగర్‌లోని సోలీపూర్‌కు చేరుకుంటున్నారు. అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహిస్తారు. టీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న తీవ్ర వ్యతిరేకత కారణంగా అన్ని గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా రాహుల్‌గాంధీ జోడోయాత్రకు తరలివస్తున్నారని ఏఐసీసీ కార్యదర్శి ఎస్ సంపత్‌కుమార్ అన్నారు. అక్కడక్కడా టీఆర్ఎస్ నాయకులు ప్రజలు రాహుల్ యాత్రకు వెళితే సంక్షేమ పథకాలు పోతాయని భయపెడుతున్నారని పేర్కొన్నారు. తమ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాల గురించి రాహుల్ పాదయాత్ర ద్వారా బయటకు వస్తే ఇది రాష్ట్రంపైనే ఎఫెక్ట్ పడుతుందని టీఆర్ఎస్ భయపడుతోందని ఆయన అన్నారు. 27న మక్తల్ నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతున్నందున మక్తల్ నియోజకవర్గ ప్రజలతో పాటు దేవరకద్ర, అలంపూర్, కొడంగల్ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు కూడా యాత్రలో పాల్గొంటారన్నారు. వీరితోపాటు ఉమ్మడి జిల్లాలోని సామాజిక వేత్తలు, రాజకీయాలకు అతీతంగా సమాజహిత కోసం పనిచేసే మేధావులు రాహుల్ యాత్రకు తరలిరావాలని పిలుపు నిచ్చారు. పాలమూరు జిల్లాలో కొనసాగుతున్న భారత్ జోడోయాత్రలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని యూత్ కాంగ్రెస్ నియోజవర్గ అధ్యక్షుడు జే.చంద్రశేఖర్ కోరారు.

# ఎమ్మెల్యేగా కూసుకుంట్ల చేసిన అభివృద్ధి ఏమిటో?

(మొదటి పేజి తరువాయి) మీ పాలనలో మునుగోడును ఏం అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. మీ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి, మా అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో బహిరంగ చర్చను నిర్వహిద్దాం. తేది, వేదిక, సమయం ఖరారు చేయండి! దీనికి మీరు సిద్ధమా అని సవాల్ చేశారు. జీఎస్టీకి సంబంధించి కేంద్రప్రభుత్వం నిర్వహించిన అనేక సమావేశాల్లో రాష్ట్రప్రభుత్వ ప్రతినిధులు, మీ సుపుత్రుడు కేటీఆర్ పాల్గొని చేనేత ట్రైనింగ్‌పైన 5శాతం జీఎస్టీకి ఒప్పుకున్న మాట వాస్తవం కాదా? మీరు, మీ సుపుత్రుడు 'డ్రామారావు' ఆడుతున్న దొంగనాటకాలను రుజువులతో సహా నిరూపించడానికి మేము సిద్ధం. మీరు సిద్ధమా? దీనిపైన మీరు, మీ కుమారుడు యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ప్రమాణం చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. . కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం 40 లక్షల వరకు జీఎస్టీ లేదు. చేనేత కార్మికులపైన మీకు నిజంగా ప్రేమ ఉంటే 20 లక్షలకే రాష్ట్రప్రభుత్వం ఎందుకు జీఎస్టీ విధిస్తోంది? దీనికి మీరు, చేనేత కార్మికులపై కపట ప్రేమ వలకబోస్తున్న 'డ్రామారావు' సమాధానం చెప్పాలన్నారు. . చేనేత సహకార సంఘాలకు క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించాలి?రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ 8 ఏండ్లకాలంలో ఎందుకు ఎన్నికలు నిర్వహిం చడం లేదన్నారు. చేనేత కార్మికుల సంక్షేమంపై మీకు ఉన్న ప్రేమ ఇదేనా అని ప్రశ్నించారు. పోచంపల్లి చేనేత బజారు స్థలం కబ్జా అయ్యిందని అనేక సంవత్సరాలుగా చేనేత కార్మికులు పోరాడుతున్నారు. దీనిపైన మీకు, మీ సుపుత్రుడు 'డ్రామారావు' కు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చారు. అయినా ఈ సమస్యను పరిష్కరించి కబ్జా స్థలాన్ని వారికి అప్పజెప్పలేదు. ఇదేనా మీకు పద్మశాలీల మీద ఉన్న ప్రేమ అని అన్నారు. చేనేత కార్మికులపై మీ ప్రభుత్వానికి ప్రేమ ఉంటే టెస్కోకు చైర్మన్, డైరెక్టర్లను ఎందుకు నియమించడం లేదని అన్నారు. మీకు నిజం చెప్పకూడదనే శాపం ఏమైనా ఉందా? ఏనాడూ మీరు నిజం చెప్పరు? ప్రతినిత్యం ఝూటా మాటలతో 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలను వంచిస్తున్నారు. కనీసం మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగానైనా నిజాలు మాట్లాడి ఇప్పటివరకు మీరు మాట్లాడిన ఝూటా మాటలకు చెంపలేసుకుని క్షమాపణ చెప్పండని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# నాగోల్ 2 ఎల్బీనగర్ ప్లై ఓవర్



(మొదటి పేజి తరువాయి) మంత్రి కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించడానికి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక రహదారి అభివృద్ధి పథకంలో భాగంగా నాగోల్ ఫ్లై ల్గ÷వర్‌ను నిర్మించారు. దాదాపు ఒక కిలోమీటర్ పొడవున్న ఈ వంతెన మీద ఆరు లైన్లలో వాహనాలు రాకపోకలు సాగించనున్నాయి. ఇప్పటికే ఎల్బీనగర్ జంక్షన్ దగ్గర అండర్ పాస్ నిర్మాణంతో ఇన్నర్ రింగ్ రోడ్డుపై ప్రయాణం సాఫీగా సాగుతున్నది. ఇప్పుడు నాగోల్ వంతెన ప్రారంభంతో శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆరాంఘర్, ఎల్బీ నగర్ మీదుగా ఉప్పల్ వరకు, అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు సులభతరం కానున్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి,ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పోస్ట్ కార్డు ఉద్యమానికి అనూహ్య స్పందన

## కెటిఆర్, కవితల పిలుపుతో వందల సంఖ్యలో లేఖలు

**జగిత్యాల,అక్టోబర్ 26 (సమ సమాజం):** చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని రద్దు చేయాలని ప్రారంభించిన పోస్టుకార్డుల ఉద్యమానికి అనూహ్య స్పందన వస్తుంది. తెలంగాణలోని ప్రజాప్రతినిధులు, చేనేత కార్మికులు ప్రధాని మోదీకి పోస్టుకార్డులను పంపాలని మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపును స్వాగతిస్తూ ప్రతిరోజూ వందల సంఖ్యలో కార్డులను రాస్తున్నారు. దీంట్లో భాగంగా జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ భోగ శ్రావణి ప్రవీణ్, వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిల్ ఫోరమ్ ఉపాధ్యక్షులు బొడ్ల జగదీశ్ మోదీకి పోస్టుకార్డులు రాశారు. వీరితో పాటు కౌన్సిలర్లు తోట మల్లికార్జున్, ముస్కు నారాయణ రెడ్డి, కోరే గంగమల్లు,అల్లే గంగాసాగర్, కూతురు రాజేశ్, పిట్టా ధర్మరాజ్, నాయకులు బలే శంకర్,సుల్తాన్ ఉద్దీన్ అహ్మద్, బద్ధం జగన్,నాయకులు కార్డులు రాసిన వారిలో ఉన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బొట్ల వనపర్తి గ్రామ చేనేత పవర్ లూమ్ కార్మికులు, పద్మశాలీలు చేనేత వస్త్రాల పై జీఎస్టీ రద్దు చేయాలని పోస్టుకార్డులను రాశారు. బొట్ల వనపర్తి గ్రామానికి చెందిన పద్మశాలీ సంఘం గ్రామ అధ్యక్షులు బోట్ల మల్లేషం, మండల కన్వీనర్ కూరపాటి శ్రీనివాస్ , చేనేత పవార్ లూమ్ కార్మికులు మోర బుచ్చి రాములు బోట్ల శంకరయ్య బోట్ల సత్యనారాయణ బోట్ల మల్లేశం సింగిల్ విండో సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. చేనేత వస్త్రాలు, చేనేత ఉత్పత్తులపై ఉన్న ఐదు శాతం జీఎస్టీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గే

- సోనియా నుంచి బాధ్యతలు స్వీకరించిన ఖర్గే
- నియామకపత్రాన్ని అందచేసిన మధుసూధన్ మిస్త్రీ
- ప్రమాణస్వీకారానికి హాజరైన సోనియా, రాహుల్, ప్రియాంక
- అత్యంత భావోద్వేగ క్షణాలని ప్రకటించిన ఖర్గే
- రాజ్‌ఘాట్‌లో మహాత్ముడికి నివాళి అర్పించిన అధ్యక్షుడు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా మల్లికార్జున ఖర్గే బుధవారం బాధ్యతలు చేపట్టారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఈ బాధ్యతలను ఆయనకు అప్పగించారు. అంతకుముందు ఆయన రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళు లర్పించారు. ఖర్గే బుధవారం మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, జగ్జీవన్ రామ్‌లకు నివాళులర్పించారు. ఆయన మంగళవారం మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌ను కూడా కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్ష హోదాలో ఖర్గే మాట్లాడుతూ, ఇవి అత్యంత భావోద్వేగ క్షణాలని తెలిపారు. కాంగ్రెస్ ఔన్నత్యాన్ని కొనసాగించడం గర్వకారణమని పేర్కొన్నారు.కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికైనట్లు ఎలక్షన్ సర్టిఫికేట్‌ను ఖర్గేకు ఆ పార్టీ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ అందజేశారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక సహా నేతలంతా ఖర్గేను అభినందించి.. శుభాకాంక్షలు తెలిపారు.ఖర్గేను అభినందించిన సోనియా గాంధీ మాట్లాడుతూ, కాంగ్రెస్ అధ్యక్ష పదవి అనేది అత్యంత గొప్ప బాధ్యత అని చెప్పారు. తాను తన విధులను అత్యంత నిజాయితీతో నిర్వహించేందుకు ప్రయత్నించానని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో శశి థరూర్‌పై మల్లికార్జున ఖర్గే భారీ ఆధిక్యంతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ నెల 17న జరిగిన ఈ ఎన్నికల్లో ఖర్గేకు 7,897 ఓట్లు, థరూర్‌కు 1,072 ఓట్లు వచ్చాయి. 50 ఏళ్ళలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టిన రెండో దళితునిగా ఖర్గే రికార్డు సృష్టించారు. 1970లో జగ్జీవన్ రామ్ ఈ పదవిని చేపట్టారు. గాంధీ కుటుంబీకులు కాని నేత ఈ పదవిని చేపట్టడం 24 ఏళ్ళలో ఇది రెండోసారి. ఖర్గేకు ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో ప్రావీణ్యం ఉంది. ఆయన 1942 జూలై 21న కర్ణాటకలోని బీదర్ జిల్లాలో జన్మించారు. ఓ ప్రభుత్వ పాఠశాలలో మరాఠీ మాధ్యమంలో చదువుకున్నారు. ఆయన బౌద్ధ మతాన్ని ఆచరిస్తున్నారు. తాను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అనుచరుడినని ఆయన ప్రకటించుకున్నారు. 1969లో ఇందిరా గాంధీని కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించారు. అదే సంవత్సరం ఖర్గే ఆ పార్టీలో చేరారు. అదే సంవత్సరం 27 ఏళ్ళ వయసులో కలబురగి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టిన ఖర్గే ముందు హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ శాసన సభ ఎన్నికల సవాళ్ళు ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్ శాసన సభ ఎన్నికలు నవంబరు 12న జరగబోతున్నాయి. గుజరాత్ శాసన సభ ఎన్నికల షెడ్యూలు కూడా త్వరలో వెలువడే అవకాశం ఉంది. ఈ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను గెలిపించే బాధ్యత ఆయనపై ఉంది. హిమాచల్ ప్రదేశ్ ఓటర్లు వరుసగా రెండు ఎన్నికల్లో ఒకే పార్టీని గెలిపించరనే నానుడి ఉంది. ఈసారి కూడా అది నిజమై, బీజేపీని ఓడించి, కాంగ్రెస్‌ను గెలిపిస్తారనే భావన ఖర్గే అనుచరుల్లో ఉంది. మరోవైపు గుజరాత్‌లో బీజేపీని ఓడించే పరిస్థితులు పెద్దగా కనిపించడం లేదని, ప్రస్తుతం అక్కడ కాంగ్రెస్ ప్రచారం కూడా తక్కువ స్థాయిలోనే ఉందని స్థానిక మీడియా చెప్తోంది. మరోవైపు 2024లో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీని అధికారానికి దూరం చేయడం ఖర్గేకు పెద్ద సవాలు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు అక్టోబరు 24 నుంచి 26 వరకు విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే.

# గొల్లకురుమల అభివృద్ధికి కెసిఆర్ కృషి

(మొదటి పేజి తరువాయి) జాతి అని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. నాడు న్యాయం, ధర్మం పాండవుల వైపు ఉన్నందునే శ్రీకృష్ణుడు ధర్మాన్ని నిలబెట్టాడని చెప్పారు. గతంలో ఏ సీఎం చేయని విధంగా సీఎం కేసీఆర్ గొల్ల కురమలను అభివృద్ధి చేశారని, వారిని ఆర్థికంగా నిలబెట్టారని మంత్రి తెలిపారు. గొల్ల కురమలలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకంటే ఎక్కువ తెలివి తేటలు ఉంటాయని గతంలో అసెంబ్లీలో సీఎం చెప్పిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. మన్నెగూడలో జరిగిన యాదవ-కురమ సభలో మాట్లాడిన మంత్రి.. గొల్ల కురమలకు 75 శాతం సబ్సిడీతో గొర్రె పిల్లలు ఇచ్చిన ఏకైక సీఎం కేసీఆర్ మాత్రమేనని చెప్పారు. ప్రభుత్వంలో, చట్టసభల్లో గొల్ల కురమలకు భాగస్వామ్యం కల్పించారన్నారు. కర్ణాటకలో అప్పటి మంత్రి, కాంగ్రెస్ నాయకుడు రేవణ్ణ గొర్రెల స్కీమ్ గురించి తెలుసుకుని సీఎం కేసీఆర్‌ను అభినందించారని, హైదరాబాద్‌కు వచ్చి గొంగడి కప్పి, గొర్రెపిల్లను ఇచ్చి సన్మానించాడని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ హైకమాండ్ నోటీసులు ఇచ్చినా రేవణ్ణ భయపడలేదని చెప్పారు. కురమలకు, యాదవులకు ఆత్మగౌరవ భవనాలు నిర్మాణమవుతున్నాయని, రెండు మూడు నెలల్లో ప్రారంభమవుతాయని మంత్రి చెప్పారు. హుజూరాబాద్ లో దళితబంధు పథకం పెడితే ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని, అయినా ఇప్పటివరకు తాము 24 వేల కుటుంబాలకు దళిత బంధు అమలు చేశామని ఆయన తెలిపారు. గొల్ల కురమలు గొర్రెలు కొనుక్కోవడానికి ప్రభుత్వం డబ్బులు వేయిస్తే.. ఆ డబ్బులు చేతికి రావని, సీజ్ అవుతయని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేశాయన్నారు. కానీ, వచ్చే నెల ఐదో తేదీ తర్వాత ఎప్పటిలాగే మీకు నచ్చిన చోట గొర్రెలు కొనుక్కునే అవకాశం కల్పిస్తమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ జనం కోసం చేసిందేమీ లేదన్నారు మంత్రి హరీశ్‌రావు. రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1200 వందలకు పెంచిందన్నారు. రైతులకు బాయిలకాడ, బోర్లకాడ మీటర్లు పెట్టేందుకు అంగీకరిస్తే రాష్ట్రానికి ఏడాదికి ఆరు వేల కోట్ల లెక్కన ఐదేళ్లకు 30 వేల కోట్లు ఇస్తమని కేంద్రం చెప్పిందని మంత్రి తెలిపారు. కానీ సీఎం కేసీఆర్ తన ప్రాణం పోయినా మీటర్లు పెట్టనిచ్చేది లేదని తెగేసి చెప్పిండ్రని చెప్పారు. మునుగోడులో ఓట్ల కోసం పూటకోమాట మాట్లాడే జూటాగాళ్లు వస్తున్నరని, ఆ బట్టెబాజ్, జూటేబాజ్ గాళ్లకు ఓటర్లు బుద్ధి చెప్పాలని మంత్రి పిలుపునిచ్చారు.

# 500 రోజుల్లో మునుగోడు అభివృద్ధికి ప్లాన్

(మొదటి పేజి తరువాయి) నవోదయ పాఠశాల ఏర్పాటుకు ప్రయత్నిస్తానని చెప్పారు. రూ.100 కోట్లతో మూసీ నీళ్లను చౌటుప్పల్ లోని గ్రామాలకు ఎత్తి పోసే పథకాన్ని తీసుకొస్తామని రాజగోపాల్ స్పష్టం చేశారు. ఇదిలావుంటే సీఎం కేసీఆర్ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి తన సొంత ఆస్తులను పెంచుకున్నాడని మునుగోడు ఉప ఎన్నిక బీజేపీ స్టీరింగ్ కమిటీ చైర్మన్ వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. తెలంగాణను అప్పులు రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్ కే చెల్లిందని అన్నారు. రూ.60వేల కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల వరకు అప్పులు చేశారని మండిపడ్డారు. అప్పుగా తెచ్చిన సొమ్మంతా ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు.. కాళేశ్వరంలో రూ.65,000 కోట్లు, మిషన్ భగీరథలో రూ.45,000 కోట్లు, మిషన్ కాకతీయలో 25,000కోట్ల కుంభకోణం జరిగిందని వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని గెలిపిస్తే మునుగోడులో సంక్షేమ పథకాలన్నీ బంద్ చేస్తామని మంత్రి జగదీష్ రెడ్డి ప్రజలను భయపెట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజల సొమ్ముతోనే పెన్షన్లు, ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారే తప్ప కేసీఆర్ సొంత డబ్బుతో కాదని అన్నారు. కేసీఆర్ ఇష్టమొచ్చినట్టు నిర్ణయాలు తీసుకుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తేలేదని వివేక్ వెంకటస్వామి హెచ్చరించారు.

# కాంట్రాక్ట్ రాజకీయాలకు రెఫరెండమ్



(మొదటి పేజి తరువాయి) బేరీజు వేసుకోవాలని చెప్పారు. రూ.18 వేల కాంట్రాక్టుల కోసం మునుగోడు ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టిన రాజగోపాల్ రెడ్డి ఏనాడు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ విధంగా అభివృద్ధి జరిగిందో మునుగోడును సైతం అదేలా అభివృద్ధి చేసుకోవాలంటే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ఎన్నికలు స్వార్థ కాంట్రాక్టులు చేసే అభ్యర్థులకు, పార్టీలకు రెఫరెండంగా ఉంటాయని, ప్రజలు నిజమైన సేవచేసేవారిని గెలిపిస్తారని మంత్రి గంగుల చెప్పారు. ఇదిలావుంటే కులం, మతం పేరుతో మంటలు పెట్టే బీజేపీకి మునుగోడులో డిపాజిట్లు కూడా దక్కొద్దని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. అభివృద్ధి వైపు ఉంటరో.. అభివృద్ధి నిరోధకుల వైపు ఉంటారో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని నాంపల్లి మండలం ఎస్.లింగోటంలో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి జగదీశ్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ను గెలిపించుకుంటే మునుగోడులో అభివృద్ధి జట్ స్పీడ్‌తో దూసుకెళ్తుందని చెప్పారు. కూసుకుంట్ల గెలుపుతో నియోజకవర్గ దశ తిరుగుతుందని, అందివచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టుల కోసం రాజగోపాల్ రెడ్డి అమ్ముడుపోయాడని విమర్శించారు. కోమటిరెడ్డి మళ్లీ గెలిస్తే ఈ ప్రాంతానికి ఏం జరుగుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్‌తో మునుగోడు అభివృద్ధి సాధ్యమని, పార్టీ అభ్యర్థి కూసుకుంట్లను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇదిలావుంటే స్వగ్రామానికి రోడ్డు వేసుకోనోళ్లు మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారా అని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన కంటే ముందు నుంచి కోమటిరెడ్డి సోదరులు ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, ఎమ్మెల్సీగా పనిచేశారని.. అయితే కనీసం వారి స్వగ్రామమైన కాశివారి గూడానికి రోడ్డు వేయలేని దౌర్భాగ్యులని ఆగ్రహం వ్యక్తం చేశారు. మునుగోడు మండలంలోని కలవలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎంలలో ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 1999, 2004లో ఈ ప్రాంత ఎమ్మెల్యేగా గెలిచారని, పునర్విభజన తర్వాత 2009లో రాజగోపాల్ రెడ్డి ఎంపీగా, 2014లో ఎమ్మెల్సీగా, 2018లో ఎమ్మెల్యేగా గెలుపొందాడని వారి సొంత గ్రామానికి ఆనుకొని ఉన్న ఊరుకు రోడ్డు వేయలేకపోయారని విమర్శించారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఆరాటమంతా కాంట్రాక్టుల కోసమేనని ప్రజల కోసం కాదని విమర్శించారు. రాజగోపాల్ రెడ్డి కాంట్రాక్టుల కోసం బీజేపీలో చేరి.. ఉపఎన్నికకు కారణమయ్యాడని చెప్పారు. ఈ ఎన్నికల్లో కోమటిరెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

# భారత్ జోడో యాత్రపోస్టర్ ఆవిష్కరణ

## జగిత్యాలలో పాల్గొంటానన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**జగిత్యాల,అక్టోబర్ 26 (సమ సమాజం):** రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర పోస్టర్‌ను ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆవిష్కరించారు. పాదయాత్ర జగిత్యాల చేరుకున్న అనంతరం భారత్ జోడో యాత్రలో పాల్గొంటామని చెప్పారు. జోడో యాత్రకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. భారత జాతి ఐక్యతకు కులమతాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని పోస్టర్లు ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ కొత్త అధ్యక్షుడుగా బాధ్యతలు తీసుకున్న మల్లిఖార్జున్ ఖర్గేకు జీవన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వారి నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. అధికార కాంక్షతో దేశాన్ని కులాల మతాల పేరుతో ఎన్డీయేగా విభజించడాన్ని నిరసిస్తూ.. రాహుల్ జోడో యాత్ర కొనసాగుతోందని జీవన్ రెడ్డి అన్నారు. నెహ్రూ హయాంలో జాతీయ స్థాయిలో భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని చెప్పారు. ఇందిరా గాంధీ చివరి శ్వాస వరకు దేశం కోసం పని చేసి ప్రాణాలు అర్పించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. వీపీ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రజలను కులాలమతాల వారీగా విభజించే ప్రయత్నం జరిగిందని.. అప్పుడు రాజీవ్ గాంధీ సద్భావన యాత్రను అడ్డుకున్నారని, ఇప్పుడు రాహుల్ పాదయాత్ర విషయంలో అవే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.






# చలన చిత్రం

# సటర్న్ అవార్డ్సలో ఆర్ఆర్ఆర్ ఎంపిక





గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద తెలుగు సినిమా ఖ్యాతిని మరోసారి ప్రపంచానికి చాటి చెప్పిన చిత్రం ఆర్ఆర్ఆర్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. బాహుబలి తర్వాత ఎస్ఎస్ రాజమౌళి మరోసారి ఆర్ఆర్ఆర్‌తో అంతర్జాతీయ స్థాయి ప్రేక్షకుల్లో తెలుగు సినిమా క్రేజ్‌ను అమాంతం పెంచేశాడు. ఈ ఎపిక్ డ్రామా ప్రాజెక్ట్ అక్టోబర్ 21న జపాన్‌లో కూడా గ్రాండ్‌గా విడుదలైంది. కాగా ఆర్ఆర్ఆర్ ఖాతాలో ఇంటర్నేషనల్ అవార్డు పడింది. సటర్న్ అవార్డ్సలో ఆర్ఆర్ఆర్ 'ఉత్తమ అంతర్జాతీయ చిత్రం అవార్డు'కు ఎంపికైంది. సటర్న్ అవార్డ్స్ ఈ ఏడాదితో 50 ఏండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ ప్రతిష్టాత్మక అమెరికన్ అవార్డును జ్యూరీ అధికారికంగా ప్రకటించింది. ఆర్ఆర్ఆర్ ను అవార్డుకు ఎంపిక చేసిన జ్యూరీ మెంబర్స్ కు ఈ సందర్భంగా రాజమౌళి ధన్యవాదాలు తెలియజేశారు. ఇది తనకు రెండో సటర్న్ అవార్డు అని రాజమౌళి అన్నాడు. అవార్డులు గెలుచుకున్న ఇతర విజేతలకు కూడా శుభాకాంక్షలు తెలియజేశాడు జక్కన్న. రాజమౌళి వీడియో ఇపుడు నెట్టింట హల్ చల్ చేస్తోంది. మొదటి అవార్డు బాహుబలి : ది కంక్లూజన్ చిత్రానికి వచ్చింది. ఆర్ఆర్ఆర్ ప్రపంచవ్యాప్తంగా రూ.1100 కోట్లకుపైగా కలెక్షన్లు వసూళ్లు చేసి రికార్డులు సృష్టించింది.

## దెయ్యం పాత్రలో హన్సిక

రౌడీ బేబీ, 105 మినిట్స్, మై నేమ్ ఈజ్ శ్రుతి లాంటి లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతో బిజీగా ఉన్న హన్సిక.. ఇప్పుడు మరో ఫిమేల్ సెంట్రిక్ సినిమాని సెలెక్ట్ చేసుకుంది. శబరి, గురు శరవణన్ దర్శకత్వంలో 'గార్డియన్' అనే సినిమా చేస్తోంది. రియల్ లైఫ్‌లో ఎందరో అనాథ పిల్లల్ని దత్తత తీసుకుని వారికి గార్డియన్‌గా ఉందామె. ఇప్పుడొక సినిమాలో ఆ పాత్ర పోషించబోతోంది. అయితే ఇందులో ఆమె ఓ మామూలు అమ్మాయిలా కాదు.. దెయ్యంగా కనిపించనుంది. రీసెంట్‌గా ఆమె లుక్‌ని కూడా లాంచ్ చేశారు. చూడటానికే భీతిగొల్పేలా ఉంది హన్సిక లుక్. ఇది ఒక మంచి ఆత్మ కథ అని తెలుస్తోంది. ఓ పాపకి ఆ ఆత్మ గార్డియన్‌గా ఉంటుంది. తనని అన్ని ప్రమాదాల నుంచీ కాపాడుతుంది. అసలామె ఎందుకలా చేస్తోంది, వాళ్లిద్దరికీ ఏమిటి సంబంధం అనేది స్టోరీ. ప్రముఖ తమిళ దర్శకుడు విజయ్ చందర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నాడు. గతంలో చంద్రకళ, కళావతి లాంటి హారర్ చిత్రాలతో మంచి విజయాల్ని ఖాతాలో వేసుకున్న హన్సిక.. మళ్లీ ఇన్నాళ్లకు అదే జానర్ మూవీతో వస్తోంది. మరి ఈసారి కూడా సక్సెస్ సాధిస్తుందేమో చూడాలి.




## టిల్లు స్క్వేర్‌గా వస్తోన్న సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు'గా కడుపుబ్బ నవ్వించిన సిద్ధు జొన్నలగడ్డ.. 'టిల్లు స్క్వేర్'తో డబుల్ నవ్వులు పంచడానికి రాబోతున్నాడు. దీపావళి సందర్భంగా ఈ మూవీ టైటిల్ టీజర్‌ని రివీల్ చేశారు. ఫుల్ ఫన్‌తో కట్ చేసిన వీడియో ఎంటర్‌టైనింగ్‌గా ఉంది. మద్యం మత్తులో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఫిష్ వెంకట్‌తో గొడవ పెట్టుకోవడం నవ్వులు పూయించింది.'ఆల్కహాలు నాకిష్టం. స్టా ఎవరెవరి నోట్లో పెట్టావు. ఫ్రెష్ స్టాన్రా' అని అడుగుతాడు సిద్ధు. దీంతో 'సార్‌ని పిలవమంటావా' అని వెంకట్ అంటే.. 'పిలువు.. మీ సార్ పైసలతో తాగామా, మా అయ్య పైసలతో తాగాం' అంటూ తాను డీజే టిల్లు హీరోనని చెప్పడం ఆకట్టుకుంది. ఫస్ట్ పార్ట్‌లో పాపులర్ అయిన 'అట్లుంటది మనతోని' అనే డైలాగ్‌ని రిపీట్ చేసి ఇంప్రెస్ చేశాడు. రామ్ మిరియాల బ్యాగ్రౌండ్ స్కోర్ బాగుంది. మల్లిక్ రామ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్. నెక్స్ట్ ఇయర్ మార్చ్‌లో సినిమా రిలీజ్ చేయనున్నారు.

## సర్దార్ చిత్రానికీ సీక్వెల్

### హింట్‌ఇచ్చిన డైరెక్టర్ మిత్రన్




తెలుగు, తమిళ ప్రేక్షకులకు పరిచయం అక్కర్లేని నటుడు కార్తీ ఈ టాలెంటెడ్ హీరో పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో నటించిన చిత్రం సర్దార్ . స్పై థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం అక్టోబర్ 21న తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో విడుదలై మంచి టాక్‌తో స్క్రీనింగ్ అవుతూ.. నిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. కాగా ఈ సినిమాకు సీక్వెల్ ఉండబోతుందని చివరలో పరోక్షంగా హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్ పీఎస్ మిత్రన్. అయితే ఇపుడు సర్దార్ 2 చిత్రంపై కార్తీ టీం అధికారికంగా అప్‌డేట్ ఇచ్చి.. అభిమానులు, మూవీ లవర్స్ లో జోష్ నింపుతుంది. ఒకసారి స్పై అయితే, ఎప్పుడూ స్పై.. మిషన్ కంబోడియా త్వరలో మొదలవుతుంది.. అంటూ మేకర్స్ సర్దార్ 2 గురించి చెబుతూ చిన్న వీడియోను షేర్ చేశారు. ఈ వీడియో ఇపుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది. పీఎస్ మిత్రన్ డైరెక్ట్ చేయనున్న సర్దార్ 2 మూవీ 2023లో విడుదల కానుంది.కార్తీ వచ్చే ఏడాది సీక్వెల్స్ ప్రాజెక్టులతో రానుండటం ఆసక్తికర విషయం. ఇటీవలే వచ్చిన పొన్నియన్ సెల్వన్-1 మంచి హిట్టు అందుకుంది. దీనికి సీక్వెల్ పొన్నియన్ సెల్వన్ -2, లోకేశ్ కనగరాజ్ డైరెక్షన్‌లో చేయబోతున్న ఖైదీ 2 కూడా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్టు సమాచారం. ఓ యాక్టర్ ఇలా వరుసగా సీక్వెల్ ప్రాజెక్టులతో ఒకే ఏడాది రావడం చాలా అరుదనే చెప్పాలి.

# మరోమారు కొరటాల,ఎన్టీఆర్ కాంబినేషన్

టాలీవుడ్ మోస్ట్ క్రేజీ కాంబినేషన్ల జాబితాలో ఎన్టీఆర్ -కొరటాల శివ ఉంటారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ ఇద్దరి కలయికలో వచ్చిన జనతా గ్యారేజ్ బాక్సాఫీస్ వద్ద హిట్ టాక్ సొంతం చేసుకుంది. కాగా ఈ ఇద్దరూ మరోసారి ఎన్టీఆర్ 30తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ మొదలుపెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ టాక్. కాగా కొన్ని రోజులుగా ఆర్ఆర్ఆర్ జపాన్ ప్రమోషన్స్ లో బిజీగా ఉన్నాడు తారక్. అయితే ఆర్ఆర్ఆర్ లో రోరింగ్ లుక్‌లో అదరగొట్టిన ఎన్టీఆర్ ఈ సారి చేయనున్న కొరటాల శివ సినిమా కోసం మాత్రం మేకోవర్ మార్చుకుం టున్నాడని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఇక ఇపుడు నెట్టింట్లో లేటెస్ట్ గా చక్కర్లు కొడుతున్న ఫొటో తారక్ కొత్త లుక్‌పై స్పష్టత ఇచ్చేస్తుందని తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు. జీన్స్, టీ షర్ట్, మ్యాచింగ్ షూస్‌తో బ్లాక్ గాగుల్స్ పెట్టుకుని స్టైలిష్‌గా కెమెరాకు ఫోజులిచ్చాడు ఎన్టీఆర్. ఎన్టీఆర్ 30లో తారక్ కనిపించబోయే లుక్ ఇదేనంటూ ఫిక్సయిపోతున్నారు ఫాలోవర్లు, అభిమానులు, మూవీ లవర్స్. మొత్తానికి ఏదో ఒక అప్‌డేట్‌తో అభిమానులని ఫుల్ ఖుషీ చేస్తున్నాడు తారక్. కొరటాల సినిమా షూటింగ్ అప్‌డేట్ ఎప్పుడెప్పుడు వస్తుందా..? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తారక్ మరోవైపు కేజీఎఫ్ ఫేం ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో ఎన్టీఆర్ 31ను కూడా ప్రకటించాడు.





Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in